అరిసె ముక్కలు

వజ్ఝ బాబురావు

౧

మా నాన్నకు నేను పెద్దకుమారైను. నేను పుట్టిన యేడో రోజునే మాఅమ్మ బాలింత రోగము వచ్చి చనిపోయింది. ఆమె పోయిన పదమూడోరోజునే మా నాన్న మళ్ళీ పెళ్ళిచేసుకున్నాడు. నాకు బుద్ధి తెలిసేటప్పటికి మా సవతి తల్లికి ముగ్గురుబిడ్డలు పుట్టినారు.

నాకు పదేళ్ళు వచ్చేదాకా మా నాన్న నా పెళ్ళిమాట తలపెట్టలేదు. మా అమ్మమ్మ పదేపదే చెప్పడముచేత ఇక సాగదని వరుడికోసము వెతకడము ప్రారంభించినాడు. ఆ సంవత్సరము తగిన సంబంధము కుదిరిందికాదని మరునాటి సంవత్సరము వైశాఖమాసములో చెయ్య[illegible]నాడు. మరునాటి వైశాఖములో మా సవతితల్లి ఖాయిలా పడ్డది: నాలుగు నెలలు మంచాన పడి తీసుకొన్నది. ఆఖాయిలాలో ఆమెకు వచ్చేప్రాణము పొయ్యేప్రాణముగా వుండేది. చాలామంది వైద్యులను తెచ్చారు, చాలా మందులు వాడినారు. అందులో భూతవైద్యులు తతంగాలూ, తంతులూ చేశారు. వేటివల్లా రోగము తిరిగిందికాదు. గరళముకూడా చివరకు వాడినారు. కొన్నాళ్ళకు నెమ్మదిగా జబ్బు నిమ్మళించింది. ఆమె ఖాయిలాలో వుండగా నాపెళ్ళిమాట ఎవరికి జ్ఞాపకమున్నది? ఇంటికి చూడవచ్చినవారితో మాఅమ్మన్నమ్మమాత్రము మాసవతితల్లి జబ్బూ ఇంట్లో ఇబ్బందులూ చెపుతూ నాపెళ్ళియిబ్బందికూడా వాళ్ళతో కలుపుతూ వుండేది. వైశాఖమాసములో వీలుపడ్డది కాదుగదా అని మాఘమాసములో తప్పకుండా వివాహము చేస్తానని అన్నాడు మా నాన్న. 'ఏమాసములోనైనా డబ్బుఖర్చుచేసి వివాహము చెయ్యవచ్చును, గాని మాస్థితిగతులకు తగిన సంబంధము దొరకవద్దా"? అనేవాడు మా నాన్న చాలాసార్లు. ఏవో వ్యవహారాలమీద ఆయనదగ్గిరికి వచ్చిన ప్రతివారూ, 'బాబూ, అక్కడ సంబంధమున్నది, ఇక్కడ సంబంధ మున్నది,' అన్నచోటికల్లా కబుర్లు పంపి మానాన్న విచారిస్తూ వుండేవారు. 'ఈసంవత్సరము మేము చెయ్యదలుచుకోలే,' దని కొందరూ, 'అంతవారితో మేము వియ్యపొందగలమా?' అని మరికొందరూ, 'మాఘమాసానికి తూగి రాలే,' మని ఇంకో కొందరూ ఇచ్చే జబాబులు వస్తూవుండేవి. ఈరాయబారాలతో మాఘమాసము సగపడ్డది. వరుడు ఎక్కడా దొరకలేదు. నాకప్పటికి పన్నెండేళ్ళు నిండినవి.

నన్ను చూసినవాళ్ళందరూ, 'ఇంకా ఈపిల్లకు కన్నెచెర వదిలిందికా' దనేవాళ్ళు. నేను కాస్త కాలుపొడుగు

దానను. 'పెళ్ళిఅయిందా?' అనేమాట అడగకుండా చాలామంది నన్ను చూసి, 'కాపరానికి వెళ్ళిందా? లేక ఈయేడు పంపుతారా?' అని మావాళ్ళతో అనే వాళ్ళు. ఇంట్లో మాఅమ్మమ్మగోల మెక్కువయింది 'ఇక అమ్మాయికి వివాహము చెయ్యకపోతే ఎలాగు?' అని మానాన్న స్నేహితులూ, చుట్టాలూ అన్నారు. ఆయన కేమిగాతి 'చిందికాదు 'ఎక్కడైనా వరుడు దొరికితే బాగుండును!' అని నిట్టూర్పు విడిచినాడు మానాన్న. చివరకు మావూరిదగ్గర గ్రామములో ఒకసంబంధము కుదిరింది. ఎక్కువ కట్నం మిస్తాననే టప్పటికి ఒక గృహస్థు తనకుమారునికి నన్నువివాహము చేసుకోడానికి ఇష్టపడ్డాడు!

పెళ్ళికొడుకు కుదిరేదాకా నాకూ మనశ్శాంతి లేదు. 'వైశాఖమాసము లోగా సంబంధము కుదిరితే సరే; లేకపోతేదోవనుపొయ్యేవాడినిపిలిచి నాలుగెకరాలు గట్టుపెట్టి ముడివేస్తా!' అని మానాన్న ఒకసారి అన్నప్పుడు నాప్రాణము చివుక్కుమన్నది. ఎటువంటిభర్త నాకు రాసిపెట్టివున్నాడో అని నాకు దిగులుగా వుండేది. కుదిరిన పెళ్ళివారికి భూవసతి కలదనీ, కరిణీకము వున్నదనీ తెలిసి లోలోపల సంతోషించాను.

అటుతరువాత, పెళ్ళికొడుకు ఎలా వుంటాడో అని ఆందోళన! పెళ్ళివారి ఇష్టాలూ, వారిస్థితిగతులనూ గురించి మావాళ్ళు చెప్పుకుంటూవుంటే నేను గదిల్లోనో, గోతాలమెట్టుచాటునో, నిద్రపోయే ట్టానివలెనోవుండి వింటూవుండేదాన్ని. పెళ్ళికొడుకురూపురేఖ ఎంతవిన్నా ఇంకా వినవలెననే వుండేది.

మాఅమ్మమ్మ నన్ను పెంచుతూ మాయింట్లోనే వుండేది. ఆమె పెళ్ళికొడుకును గురించి మానాన్నతో మాట్లాడుతూ, "అయితే, ఓగుడు స్వామివారి రథోత్సవమునాడు గుర్రం మెక్కివచ్చిన వాడేనా పిల్లుడు?" అన్నది. ఆ తిరునాళ్ళలో ఆయనను చూచాను, గాని ఆయన పెళ్ళికొడుకవుతాడని నాకేమి తెలుసును? తెలిస్తే బాగా చూచేదాన్ని అనుకొన్నాను. అయినా అప్పుడు చూసిన జ్ఞాపకము కొంచెముగా వున్నది ఆయన ముక్కు, నోరు, కళ్ళు, చెవులు, ముందరిజుట్టూ జ్ఞాపకము తెచ్చుకోడానికి చాలా ప్రయత్నము చేశాను.

పెళ్ళిలగ్నము ఆరోజు కారోజుకు దగ్గిరిగి వస్తున్నకొద్దీ మాయింట్లో పెళ్ళి పనుల అడావడి హెచ్చింది. మాకశువుల కొట్టాలన్నీ బాగుచేశారు. దొడ్డి నిండా పెద్దపందిరి వేశారు, అప్పడాలు, వడియాలు, పచ్చళ్ళు, ఊరగాయలూ తయారయినవి పప్పులు, బియ్యాలూ, రకరకాలుగా తయారుచేయించి వంటయింట్లో బిడాయి వేశారు. పెళ్ళిరోజుల్లో వర్షము వస్తుందేమో అని గాడిపొయ్యి సావడిలో తవ్వినారు. ఇంకా పెళ్ళి అయిదారు రోజు లున్నదనగానే వంట అక్కడే చెయ్యడము ప్రారంభించారు. వివాహము రెండు మూడు రోజుల్లోకి వచ్చేటప్పటికి మాచుట్టాలంతా బళ్ళెక్కి వచ్చారు. గంటల

చప్పుడయినప్పుడల్లా వాకిట్లోకి వెళ్ళి చూచేదాన్ని. వచ్చిన చుట్టాలతో మా పెద్దమండువా యిల్లంతా నిండిపోయింది. పెళ్ళికి కొత్తబట్టలు, పోకచూర, లవంగాలు ఇంకా ఏవేవో సామగ్రిలు మా తాత గుంటూరునుంచి తెప్పించినాడు. మా నాన్నగది ఆ మూటలతో నిండిపోయింది. కొట్టుపెత్తనము మా సవతితల్లిగారి అన్నది.

రేపులగ్న మనగా మా వాళ్ళు నన్ను పెళ్ళికూతురిని చేశారు, మరి ఇద్దరిని తోడు పెళ్ళికూతుళ్ళను చేశారు. నా నొసట కళ్యాణపు బొట్టు, బుగ్గను చుక్క, కాళ్ళకు పారాణీ పెట్టినారు. మా వూరి మేళగాళ్ళు వాయించినారు. మా చుట్టాలు చీరలు, రూపాయలు, ఉంగరాలూ చదివించారు.

పెళ్ళికూతురిని చేసిననాటి సాయంకాలము మా మేనత్త, అమ్మమ్మ, మరో ముసలమ్మా అరిసెలు వండుతూ వున్నారు, అక్కడికి వెళ్ళి నేను పీటమీద కూర్చుని, వాళ్ళతో కబుర్లు చెప్తూ అరిసెముక్కలు తింటున్నాను. మా మేనత్తకొడుకువచ్చి నాసరసను నిలబడ్డాడు. "అత్తా, రాముడికికూడా ఒక అరిసె ఇయ్యి, తింటూవుంటాడు," అని నేనొక పీట చూపించాను. మా అత్త అరిసెయిస్తూ, "మా రాముడింకా రెండేళ్ళు పెద్దవాడైతే మా సుందరికి మొగుడయ్యేవాడే!" అన్నది. మా మేనత్త కొడుకు నాకంటె ఏడ్నర్థము పెద్ద, నా యెత్తు వుంటాడో వుండడో, నేనెప్పుడూ వరసలాడుతూ వుండేదాన్ని. రాముడు నాసరసపీట మీద కూర్చుని అరిసె తింటూవుంటే నా చేతి కంటిన నెయ్యి అతని బుగ్గలకు పూసి, "రాముడూ, నీవు నాకు మొగుడవయ్యేవాడవు కావాలు!" అన్నాను. "చూడవే అమ్మా, నెయ్యి రాస్తుంది! దీనికి బొత్తుగా భయము లేదు. పెళ్ళికొడుకుతో చెప్తానుండు!" అన్నాడు. మా అమ్మమ్మ మా అత్తమాటకు, "బ్రహ్మలిఖితము గదా!" అన్నది. కొంతసేపు ఎవరూ ఏమీ మాట్లాడలేదు. నేను అరిసెవంట చూస్తూవున్నాను. ఇంతలో వాకిట్లో ఎద్దులగంటల చప్పుడయింది. "వెంకమ్మప్ప వచ్చిందేమో చూడు," అని మా అమ్మమ్మ అన్నది. "రాముడూ, తిన్నది చాలుగాని, వాకిట్లోకి వెళ్ళి చూతాము, రా," అని చెయ్యి పట్టుకొని అతనిన్ని లాక్కుపోయి వీధి గుమ్మము దగ్గర నిలుచున్నాను. మా వెంకమ్మప్ప పిల్లలూ బండి దిగినారు. బండి దిగుతునే మా అప్ప, "ఏం రాముడూ, పెళ్ళికూతురికి తోడుజవానువా యేమిరా?" అన్నది. "సుందరిని పెళ్ళికొడుకుకు అప్పజెప్పేదాకా నేనే కావలి ఎవరూ ఎత్తుకుపోకుండా!" అన్నాడు.

"మంచి బంట్రోతు అక్కయ్యా!" అన్నాను.

నేను నిద్దర లేచేటప్పటికి ఒకటే అడావడిగా వున్నది. వారినీ వీరినీ బిగ్గరగా

పిలవడముతో అప్పటికే చాలామంది గొంతులు బొంగురుపోయినవి. 'పొయ్యి మండి పోతున్నది, చద్దివణ్ణాలకు బియ్యము కొలిపించండి, బాబూ!' అని వంటబ్రాహ్మడు అంటున్నాడు. మా మామ మానాన్నతో, 'పొద్దెక్కుతున్నది. భజంత్రీలను రమ్మని, వూళ్ళో మనవాళ్ళను నలుగురినీ పిలిచి రా. పెళ్లివారు వూళ్ళోకి వస్తే వారికోసం వెళ్లడానికి తర్వాత తీరదు — బుచ్చమ్మ వూళ్ళో పేరంటం పిలవడానికి తొందరగా బయలుదేరు!" అని మా సవతి తల్లితో కూడా అన్నాడు. కొంచెం సేపటికి మా నాన్నా, అమ్మా, ఇంకా కొంత మందీ మేళముతో కలిసి భోజనాలకు పిలవడానికి ఊళ్ళోకి వెళ్ళినారు.

లగ్నపత్రిక పురోహితుడి చేతికిచ్చి ఆకిందటి సాయంకాలమే పెళ్ళివారి వూరికి పంపినారు. పెళ్ళివారు రావలసిన వేళ సమీపిస్తున్నది. మామ చాకలివాడి నొకడిని పిలిచి, 'వరే, పెళ్ళివారెంతదూరము వచ్చారో చూసిరారా,' అని పంపినాడు.

నేను దొడ్లో అరుగుమీద కూర్చుని మొఖము కడుక్కొంటున్నాను. వీధిసావట్లో మామామ ఎవరితోనో పెద్దపెట్టున కేకలు వేస్తున్నాడు. పనులు చేస్తూవున్న వాళ్ళంతా ఎక్కడిపనులు అక్కడ విడిచిపెట్టి అంతా సావట్లోకి పరుగెత్తారు. వంట చేస్తున్న బ్రాహ్మడు నన్ను చూసి, 'అమ్మా, ముక్కలు కాకులూ రాకుండా చూడ' మని చెప్పి, చెయ్యి కడుక్కొని, సావట్లోకి వెళ్ళినాడు. నేను మొఖము తుడుచుకుంటూ వుండగా వంటాయన తిరిగి గాడిపొయి దగ్గిరికి వెళ్ళి, గంటె తిప్పుతూ, 'ఎంత పని జరిగింది! ఎంతసాహసము!' అన్నాడు. ఏదో దొంగతనము జరిగింది అని నే ననుకొని, 'ఏమిటండి?' అని అడిగాను.

'లగ్నపత్రిక తీసుకువెళ్ళిన బ్రాహ్మడు వచ్చాడు. పెళ్ళివారు లగ్నానికి రా మన్నారట!'

'ఏమైనా ఆటకం వచ్చిందా?'

'ఆటకం లేదు, వాళ్ళబొందా లేదు! మీ పుల్లయ్య మామగారితమ్ముడు సీమకు వెళ్ళి వచ్చిన వారితో కలిసి భోంచేశాడట. అందుచేత మీమామకు, ఆయననుబట్టి మీకూ వెలిట. స్నాతకము చేసుకుని లగ్నానికి బయలుదేరడానికి సిద్ధముగా వున్న వాళ్ళకి ఎవరో ఈసంగతి చెప్పారట. అందుమీద ఈసంబంధము మాకక్కర లేదన్నారట. పెళ్ళివారు. పీటలమీది పెళ్ళిళ్ళు పాడుచేసే ముండాకొడుకుల మాటలు పట్టుకొని ఈ వెర్రి ముండావాళ్ళు సంబంధం మానుకోవడ మేమిటి?—పాపము, బ్రాహ్మడు ఎంత ప్రయత్నము చేసుకొన్నాడు! ఇంటినిండా చుట్టాలు దిగినారు. ఊళ్ళో భోజనాలకు చెప్పివచ్చారు. వంట లవుతూ వున్నవి. నట్టేట్లో పుట్టి మునిగినట్టయింది!'

నాకేమీ తోచిందికాదు. పెళ్ళి ఇలా ఆగిపోతుం దని ఎవ రనుకొన్నారు! సంగతి ఏమిటో చూతామని సావట్లోకి వెళ్ళాను. సావడినిండా జనము మూగివున్నారు. మామామ కేకలు వేస్తూ ఇటూఅటూ తిరుగుతున్నాడు.

ఆయనవంటినిండా చెమటపట్టింది. కొంచెము బొర్రికలవాడు కావడముచేత మామామ రొజుతున్నాడు. ఎక్కడివాళ్ళక్కడ నిశ్చేష్టులై నిలవబడ్డారు. మా నాన్న ఖిన్నుడై స్తంభము ఆనుకొని, గడ్డము చేతితో పట్టుకొని, ఆలోచిస్తూ నిలుచున్నాడు.

'సూరయ్యా, నీవలా ఆలోచిస్తే కార్యము కాదు. ఆహొంగిముండాకొడుకులు రామన్నారని కార్యము మానుకొంటామా యేమిటి! వాళ్ళ మొఖముమీద కొట్టినట్టు ఈలగ్నము వేళకే వివాహము చేయించకపోతే నియోగపువాణ్ణికాను!' అన్నాడు మామామ.

ఆమాటలు విని, మామామకు మతిపోయిందనుకొన్నాను. పెళ్ళికొడుకులేకుండా పెళ్ళి, ఎలాజరుపుదామని ఆయనవుద్దేశమోఅని నేను ఆశ్చర్యపడుతూ వున్నాను.

'సూరయ్యా, చేసినపని వ్యర్థమవుతుంది. నలుగురిలోనూ నామోషీ! ఇప్పుడు పిల్లకు పెళ్ళి జరగకపోతే, పిల్లకేదో వంకని నలుగురి నోళ్ళలో పడుతుంది. ఆనక పశ్చాత్తాపించిన లాభము లేదు! నామాట విను. రాముడికీ సుందరికీ పద్మార్థము వారం వున్నదిగదా. వాడికితలంటి నీళ్ళుపోసి, స్నాతకము కానివ్వండి. పదమూడు ఘడియల పైచిలుకు దివ్యమైన లగ్నముంది. ఆలగ్నానికి ముడిపెట్టిదాము!' అన్నాడు మామామ.

మానాన్న ముఖముకేసి చూస్తూవున్నాను. ఆయన ముఖానికి తెలివి వచ్చింది. 'సరే, జరుపుదాము,' అన్నాడు. నేను ఇటూ అటూ చూస్తూవుప్పటికి నా పక్కనే గోడ ఆనుకొని మాబావ నిలుచున్నాడు. ఆయనను చూచేటప్పటికి నా కెక్కడలేనిసిగ్గూవచ్చింది. తొందరగా దొడ్లోకి వెళ్ళుదామని బయలుదేరేటప్పటికి మాబావ నాకొంగుపట్టుకొని, 'ఎక్కడినించి వచ్చిందే సిగ్గు?' అన్నాడు. ఇంతలో మామామ ఆయనను చూసి, 'పురుషోత్తం, మరదలితో తర్వాత సరసాలాడవచ్చుగాని ముందిటురా!' అన్నాడు. ఒక్కపరుగున నేను గదిలోకి వెళ్ళిపడ్డా!

3

నేను మంచముమీద పడుకొని గోడమీద సావిత్రీ సత్యవంతుల బొమ్మ చూస్తూ వున్నాను. కొంచెము సేపటికి లో నాకు కునుకు పట్టింది.

మెలుకువ వచ్చి నేను కళ్ళు తెరిచేటప్పటికి మాసవతితల్లి నన్ను చేతితో తట్టుతూ, 'సుందరీ, ఇక్కడున్నావటే! లేచి రా, తలంటి నీళ్ళుపోస్తాను. గౌరి పూజ చేతువుగాని,' అన్నది.

కొంతసేపటికి మామామ నన్నో తట్టలో కూచోబెట్టి, సావట్లోకి ఎత్తుకొని వెళ్ళాడు. సావడినిండా జనము కూర్చున్నారు. ఆడవాళ్ళంతా ఒకచోట నిలబడి వున్నారు. ఇద్దరు బ్రాహ్మలు మంత్రాలు చెప్పుతూ కొత్తబట్ట అడ్డముగా పట్టుకొని నిలుచున్నారు. నాకా పొద్దున జరిగినదేమీ జ్ఞాపకము లేదు.

అయితే పెళ్ళికొడుకు ఏలావుంటాడో చూతామనుకొన్నాను. మాయిద్దరికీ మధ్య అడ్డముగా వున్న బట్టలోనుంచి పెళ్ళికొడుకు రూపరేఖలు కనబడతవేమో అని ప్రయత్నముచేసి చూచాను. కొంతసేపటికి లీలగా ఆకారము కనబడ్డది. మరికొంతసేపటికి అడ్డముగా పట్టినబట్ట చప్పున తీసివేశారు పెళ్ళికొడుకును చూచేటప్పటికి మా మేనత్తకొడుకే! నాకు చాలా ఆశ్చర్యము వేసింది నే నింకా నిద్రపోతూ వున్నానేమో అనుకున్నాను. ఇలా అనుకొని ఒకమాటు కళ్ళుతుడుచుకునే టప్పటికి పెళ్ళికుమారుడు లేచి నాకంఠాన మంగళసూత్రము కట్టినాడు. నాకు నిద్రపట్టక ముందు జరిగిన సంగతులన్నీ జ్ఞప్తికివచ్చినవి.

ఆరాత్రి స్థాలీపాకము చేయించారు. తలవంచుకొని కూర్చున్నంతసేపూ పెళ్ళికొడుకును నఖశిఖపర్యంతము చూస్తూనే వున్నాను. అదివర కున్నట్టు లేరువారు; పెళ్ళికొడుకయిన దగ్గరనుంచీ ఏమో వింతగా కనబడ్డారు.

మరునాడు మేజువాణి. మేమిద్దరము పూలబంతు లాడినాము. ముత్తైదలు పాటలు పాడినారు. భోగము మేళముకూడావున్నది. నామనస్సు వీటిమీద లేనేలేదు. పెళ్ళికొడుకే నాహృదయమంతా ఆక్రమించుకొన్నారు.

ఆరాత్రి ఆపోసనము అయిన తర్వాత నేనువెళ్ళి దొడ్డి అరుగుమీద కూర్చున్నాను. అక్కడయెవ్వరూ లేరు. ఇంతలోకే ఎవరో నాదగ్గిరికి వస్తున్నట్టు తోచింది. తిరిగి చూసేటప్పటికి పెళ్ళికొడుకు నాదగ్గిరిగావచ్చి నిలుచున్నారు! నేను లేవబోయినాను.

'ఏం, పెళ్ళికొడుకును అయినానా లేదా!' అని నవ్వుతూ అన్నారు. సిగ్గుపడి పరుగెత్తినాను.

౪

తర్వాత చాలా కాలమునకు కాపరానికి వెళ్ళినాను. మా అత్తగారు ఒకనాడు అరిసెలు వండుతూవున్నది. నేనామె దగ్గిరగా కూర్చుని తింటున్నాను. ఇంతలోకే మావారు సావట్లోనుంచి చప్పునవచ్చి నన్నుచూసి, 'నాకుకూడా అరిసెముక్కలు పెట్టించవూ?' అన్నారు.

నేను కూర్చున్న చోటునుంచి వెంటనే లేచాను. చేతిలో అరిసెముక్క కిందపడ్డది. నేనక్కడ నిలవక సావట్లోకి వెళ్ళినాను, వారు నా వెంటనే సావట్లోకివచ్చి, 'బుగ్గలకు నెయ్యిరాస్తావా యేమి?' అన్నారు.

పెళ్ళినాటి సంగతి జ్ఞాపకమువచ్చి నాకు నాకు చాలా సిగ్గువేసింది. అరిసెలు వండవలసివచ్చినా, తినవలసివచ్చినా ఇప్పటికీ నాకు అపరిమితమైన సిగ్గు! ఇంతలో వారు నాదగ్గిరకువచ్చి, ఏమేమో నెమ్మదిగా నాచెవిలో అన్నారు. ఆమాట లేవీ నాబుర్ర కెక్కలేదు. ఈ స్థితిలో మావారి బుగ్గలకు అప్రయత్నముగా నాచేతిజిడ్డు అంటింది!